సాక్షి నిర్మల్

ఆదివారం । 9 । జూలై । 2023



ఆయుష్షు ప్ర'దాతలు'..!
మనిషి మరణించినా ఈ లోకాన్ని చూడాలంటే నేత్రదానం వల్ల సాధ్యమవుతుంది. ఒక్కరు అవయవదాతగా మారడం వల్ల తొమ్మిది మందికి జీవితాన్ని ప్రసాదించే అవకాశం ఉంది. 8లో▸



వానలో.. ఉపాధి
వర్షాకాలం వచ్చేసింది. బయటకు వెళ్తే వానకు తడవకుండా ఉండేందుకు జనం రెయిన్ కోట్‌లు, గొడుగులను కొనుగోలు చేస్తుండడంతో వీటి అమ్మకాలు జోరందుకున్నాయి. 9లో▸

గరిష్టం/కనిష్టం
32.2 /24.2

వాతావరణం
ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. వాతావరణం చల్లబడుతుంది. సాయంత్రం అక్కడక్కడ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

సాయిచంద్ కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి



సాయిచంద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి

నిర్మల్‌టౌన్: ఇటీవలే గుండెపోటుతో మరణించిన గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ సాయిచంద్ కుటుంబాన్ని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి శనివారం పరామర్శించారు. సాయిచంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. మంత్రి వెంట బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు ఉన్నారు.

టీ9 టికెట్ల సమయం పెంపు

నిర్మల్‌టౌన్: పల్లెవెలుగు బస్సుల్లో టీ9 టికెట్‌తో ప్రస్తుతం ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ప్రయాణించే అవకాశం ఉండగా.. ఈనెల 9 నుంచి సమయాన్ని రాత్రి 9 గంటల వరకు పెంచుతున్నట్లు ఆర్టీసీ నిర్మల్ డిపో మేనేజర్ సాయన్న తెలిపారు. రూ.100 కే టీ9 టికెట్ పేరుతో 60 కిలోమీటర్ల వరకు రాను పోను ప్రయాణించే అవకాశం ఆర్టీసీ కల్పించిందన్నారు. అలాగే రూ.20 కాంబో టికెట్‌తో రిటర్న్ జర్నీలో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఎక్కవచ్చని వెల్లడించారు. ఈ టికెట్ ద్వారా రూ.20 నుంచి రూ.40 వరకు డబ్బు ఆదా చేయవచ్చని పేర్కొన్నారు. ఇది మహిళలు, సీనియర్ సిటీజన్లకు వర్తిస్తుందని తెలిపారు.

మతపరమైన విద్వేషాలను రెచ్చగొట్టొద్దు

• ఎస్పీ ప్రవీణ్‌కుమార్

నిర్మల్‌టౌన్: ఎవరైనా సోషల్ మీడియాలో ఫేక్ వీడియోలు వైరల్ చేసి మత విద్వేషాలు రెచ్చగొడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ ప్రవీణ్‌కుమార్ హెచ్చరించారు. ఇటీవలే ఇరు వర్గాల మధ్య విద్వేషాలు సృష్టించి, శాంతి భద్రతలకు భంగం కలిగించే విధంగా సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టిన ఆనంద్‌పై ఖానాపూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి, రిమాండ్‌కు పంపినట్లు పేర్కొన్నారు. సోషల్ మీడియాలో మార్ఫింగ్ చేసిన వీడియోలు, పుకార్లను, వివిధ పోస్టులను ప్రజలు నమ్మి ఆవేశానికి లోనుకావొద్దని కోరారు. సోషల్ మీడియాపై నిఘా పెడుతున్నట్లు తెలిపారు.

'ఓపీఎస్ సాధన సంకల్పయాత్రకు మద్దతు'



పోస్టర్ ప్రదర్శిస్తున్న తపస్ నాయకులు

భైంసాటౌన్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ పునరుద్ధరించాలనే డిమాండ్‌తో తెలంగాణ రాష్ట్ర సీపీఎస్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో చేపడుతున్న ఓపీఎస్ సాధన సంకల్ప రథయాత్రకు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు తపస్, పీఆర్‌టీయూ నాయకులు తెలిపారు. ఈ మేరకు భైంసాలోని తపస్, పీఆర్‌టీయూ సంఘ భవన్‌లో శనివారం వేర్వేరుగా రథయాత్ర పోస్టర్లను ప్రదర్శించారు. అనంతరం మాట్లాడుతూ.. ఈనెల 16 నుంచి అన్ని జిల్లాల మీదుగా రథయాత్ర కొనసాగుతుందని తెలిపారు. ఈనెల 12న నిర్వహించే చలో హైదరాబాద్‌కు సైతం మద్దతు తెలుపుతున్నామన్నారు. సీపీఎస్‌ఈయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కృష్ణారావు, భూమన్న, తపస్ నాయకులు జి.రాజేశ్వర్, చంద్రప్రకాశ్, పీఆర్‌టీయూ నాయకులు బీవీ.రమణారావు, పి.గజ్జారాం, మల్లారెడ్డి పాల్గొన్నారు.

సైన్స్ పరిశోధకులను ప్రోత్సహించాలి

నిర్మల్ రూరల్: సైన్స్ పరిశోధకులను ప్రభుత్వం ప్రోత్సహించాలని, విజ్ఞాన ప్రసార్ సంస్థను నిర్వీర్యం చేయడం మానుకోవాలని జన విజ్ఞాన వేదిక సైన్స్ అండ్ టెక్నాలజీ జిల్లా కన్వీనర్ పోలకొండ నారాయణవర్మ కోరారు. జిల్లా కేంద్రంలోని ఎస్‌టీయూ భవనంలో శనివారం జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. విజ్ఞాన శాస్త్రం, మెడికల్ విభాగంలో జరిగే పరిశోధనలకు ఇచ్చే అవార్డులను తగ్గించడం తగదన్నారు. సైన్స్ పరిశోధకులకు విజ్ఞాన్‌రత్న లాంటి ఉన్నత అవార్డు ఇవ్వాలన్నారు. సైన్స్, మెడికల్, ఇతర విజ్ఞాన శాస్త్ర పరిశోధకులకు అవార్డులు ఇచ్చి ప్రోత్సహించడం ద్వారా ఆవిష్కరణలు పెరుగుతాయన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు గాజర్ల నారాయణ, ప్రధాన కార్యదర్శి అంకం గంగాధర్, గౌరవ అధ్యక్షుడు ఆకుల సుదర్శన్, రాష్ట్ర కార్యదర్శి గజపల్లి నరసయ్య, చెకుముకి కన్వీనర్ అనంత విశ్వేశ్వర్, కార్యదర్శి రావుల గంగన్న, సభ్యులు పాల్గొన్నారు.

అమ్మకు కమ్మని బోనం



జాతరకు ముస్తాబైన బంగల్‌పేట్ మహాలక్ష్మి ఆలయం



ఆలయంలో అమ్మవారు..

• ఊరూరా ఆషాఢ బోనాలు
• జోరుగా గ్రామదేవతలకు నైవేద్యాలు
• నేడు జిల్లావ్యాప్తంగా బోనాల జాతర

నిర్మల్: 'అమ్మా.. మమ్ము సల్లంగ సూడు. పిల్లాపాపలు, పాడిపంటలు అన్నీ బాగుండాలె. యాడాదంతా మంచి జరగాలె. నీ మొక్కులన్నీ తీర్చుకుంటం.. నువ్వే దిక్కు తల్లీ..' అంటూ రెండు చేతులెత్తి తల్లులకు జిల్లా మొక్కుతోంది. జిల్లా వ్యాప్తంగా ఆదివారం బోనాల జాతర చేపట్టనున్నారు. ఆషాఢం ప్రారంభమై రెండువారాలైనా.. ఈ మూడో ఆదివారం మాత్రం అన్నివర్గాల ప్రజలూ బోనమెత్తనున్నారు. పల్లెపట్నం తేడా లేకుండా గ్రామదేవతలకు నైవేద్యాలు పెట్టి, మొక్కులు తీర్చుకోనున్నారు. ఇక ఆషాఢంలో వేసే బోనాల్లోనూ ఆరోగ్య రహస్యాలు దాగి ఉండటం ఈ వేడుకల ప్రత్యేకత.

గ్రామ దేవతలకు..
అన్నీ ఇచ్చే అమ్మలకే అన్నం(బోనం) సమర్పించే పండుగ ఇది. ఆషాఢం ప్రారంభంతోనే ఊరూవాడల్లో గ్రామదేవతల ఆలయాలు ముస్తాబవుతాయి. పోచమ్మ, మహాలక్ష్మమ్మ, మారెమ్మ, ఎల్లమ్మ, పెద్దమ్మ, మైసమ్మ, ముత్యాలమ్మ, మహంకాళమ్మ తదితర గ్రామదేవతలైన తల్లులందరికీ బోనాలను సమర్పిస్తారు. ప్రజలను, ఊళ్లను, చేలను, చెరువులను ఇలా అన్నింటినీ రక్షించే దేవతలుగా అమ్మవార్లను కొలువడం ఆనవాయితీ. ఆషాఢంలోనే కాకుండా ఇంట్లో ఏ శుభకార్యమున్నా ముందుగా అమ్మలకు బోనం సమర్పించడం తెలంగాణ సంస్కృతిలో భాగం.

మట్టికుండలో వండి..
అమ్మలకు ఇష్టమైన బోనం(భోజనం) కొత్త కుండలో వండుతారు. ఆనవాయితీ ప్రకారం కొంతమంది రాగి పాత్రల్లోనూ వండి సమర్పిస్తారు. అన్నం, పాయసం, ఆకుకూర, అప్పాలు, గారెలు ఇలా ఎవరి ఆచారం ప్రకారం వారు గ్రామదేవతలకు నైవేద్యం పెడుతుంటారు. ఊరంతా ఒకేసారి తమ ఇళ్లల్లో వండిన బోనాన్ని కుండల్లో పెట్టుకుని, దానిపై దీపాన్ని వెలిగించి, నెత్తిన పెట్టుకుని ఊరేగింపుగా డప్పుచప్పుళ్లతో తల్లుల దగ్గరికి తరలివెళ్తారు. దారి పొడవునా పసుపునీళ్లు, పసుపును, వేపాకులను చల్లుతూ వెళ్తుంటారు. అమ్మలకు మోదుగ, పసుపు ఆకుల్లో బోనాలను సమర్పిస్తారు.

ఆరోగ్య రహస్యం..
ఆషాఢంలో అమ్మవార్లకు సమర్పించే బోనాల్లోనూ ఆరోగ్యం దాగి ఉంది. వర్షాకాలం అంటేనే వ్యాధుల కాలం. సీజన్ ప్రారంభం కావడంతోనే ఆషాఢ బోనాలు సమర్పిస్తుంటారు. ఈ బోనాల్లో పసుపు, వేపాకులు ఉపయోగిస్తారు. చాలా గ్రామాల్లో ఇప్పటికీ బోనాల జాతరలో వీటిని ఊరంతా చల్లుతారు. కొన్ని గ్రామాల్లో ఊరపండుగ పేరిట జరిపే వేడుకకు ముందుగా కట్టడి చేస్తారు. అంటే.. గ్రామంలోకి ఎవరినీ రానివ్వకుండా, గ్రామస్తులు ఎవరూ బయటకు వెళ్లకుండా చూస్తారు. యాంటీబయాటిక్‌గా పేర్కొనే పసుపునీళ్లు, వేపాకులను వీధుల్లో చల్లుతారు. ఇదంతా అంటువ్యాధులు, వైరస్‌లు ప్రబలకుండా చేసే ప్రక్రియలో భాగం. ఇక అమ్మవార్ల ప్రసాదంగా స్వీకరించే పుట్నాల్లోనూ వాము, బెల్లం కలిపి పంచుతారు. ఇవి ఈ సీజన్‌లో పిల్లలు, పెద్దలను ఇబ్బందిపెట్టే దగ్గు, జలుబు సహజసిద్ధంగా నయం చేస్తాయి.

జిల్లా కేంద్రంలో..
400 ఏళ్లకుపైగా చరిత్ర కలిగిన నిర్మల్‌లో తరతరాలుగా బోనాలను సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. జిల్లా కేంద్రానికి ఇలవేల్పులుగా భావించే బంగల్‌పేట్ మహాలక్ష్మమ్మతోపాటు పలువాడల్లో కొలువుదీరిన పోచమ్మ, మంచిర్యాలరోడ్డులోని మారెమ్మ, పెద్దమ్మతోపాటు ఆయా తల్లులకు బోనాలు సమర్పిస్తుంటారు. ఆషాఢ బోనాల్లో భాగంగా మూడోవారమైన ఆదివారం అధికసంఖ్యలో బోనాలు సమర్పించనున్నారు. ఇందుకు ఆయా ఆలయాల వద్ద కమిటీలు, మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

పేదల గుండె చప్పుడు వైఎస్సార్



కడెంలో.. వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్/ఖానాపూర్/ముధోల్/లక్ష్మణచాందా: పేదల గుండెచప్పుడు, సంక్షేమ పాలనకు నిలువెత్తు నిదర్శనం దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి అని పలువురు నేతలు అభిప్రాయపడ్డారు. వైఎస్సార్ 74వ జయంతి వేడుకలను జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. పార్టీలకు అతీతంగా నాయకులు, ప్రజలు ఘనంగా నివాళులర్పించారు. వైఎస్సార్ సేవలను, ఆయన ప్రవేశపెట్టిన పథకాలను గుర్తుచేసుకున్నారు. కాంగ్రెస్ నాయకులు శ్రీహరిరావు నిర్మల్‌లో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రుణమాఫీ, ఆరోగ్యశ్రీ, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, ఇందిరమ్మ ఇల్లు, యూనివర్సిటీల ఏర్పాటు వంటి అనేక సంక్షేమ పథకాలను అందించారని గుర్తు చేసుకున్నారు. ఖానాపూర్‌లోని తెలంగాణ తల్లి చౌరస్తాలో వైఎస్సార్ జయంతి వేడుకలు వైఎస్సార్‌టీపీ ఆధ్వర్యంలో నిర్వహించారు. కడెంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు వైఎస్సార్‌కు నివాళులర్పించారు. ముధోల్‌లో వైఎస్సార్ టీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో వైఎస్సార్‌కు నివాళులర్పించారు. లక్ష్మణచాంద మండలం చామన్‌పెల్లిలోని కాపు సంఘ భవనంలో వైఎస్సార్ జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో యువకులు మహిపాల్‌రెడ్డి, రామ్‌రెడ్డి, సాగర్‌రెడ్డి, ప్రకాశ్‌రెడ్డి, మనోజ్‌రెడ్డి, విష్ణు, సురేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్ జయంతి వేడుకల్లో పాల్గొన్న నాయకులు

దినసరి కార్మికుల సమస్యలపై మంత్రులకు వినతి



మంత్రి హరీశ్‌రావుకు విన్నవిస్తున్న కార్మికులు

ఖానాపూర్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న దినసరి కార్మికులతోపాటు 4వ తరగతి ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, సత్యవతి రాథోడ్‌కు యూనియన్ తరఫున శనివారం వినతిపత్రం అందించారు. హైదరాబాద్‌లో ఈమేరకు మంత్రులను కలిశారు. 30 ఏళ్లుగా దినసరి కార్మికులుగా పనిచేస్తున్న తమను రెగ్యులర్ చేయాలని కోరారు. ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్న బకాయిలను చెల్లించాలని కోరారు. అర్హులకు పదోన్నతి కల్పించాలన్నారు. మంత్రులను కలిసినవారిలో సంఘం ఉమ్మడి జిల్లా గౌరవ అధ్యక్షుడు కేబీసీ.నారాయణ, నాయకులు సీడాం శ్రీనివాస్, ఈ రాజలింగు, కోల వసంత్, అమరగోని రమేశ్, వినాయక్, కమల, జంగు, అశోక్, రమేశ్, చంద్రకళ, సుమన్‌బాయి తదితరులు ఉన్నారు.

తెల్లారిన బతుకులు..!

• వెనుక నుంచి దూసుకొచ్చిన మృత్యువు
• వేకువజామున రోడ్డు ప్రమాదం
• రెండు కుటుంబాల్లో తీరని శోకం
• ఒక కుటుంబంలో భార్య, భర్త, కూతురు దుర్మరణం
• మరో కుటుంబంలో వృద్ధురాలు అక్కడికక్కడే మృత్యువాత
• రేపు ఉద్యోగంలో చేరాల్సిన మహిళ కానరాని లోకాలకు
• ప్రార్థనలకు వెళ్లి వస్తుండగా ఘటన



ప్రమాద స్థలంలో నుజ్జునుజ్జు అయిన ఆటో.. రోడ్డు పక్కన మృతదేహాలు

ఆదిలాబాద్‌టౌన్/గుడిహత్నూర్: చీకటి ప్రయాణం వారికి చివరి ప్రయాణమే అయింది. తెల్లవారక ముందే వారి జీవితాలు తెల్లారిపోయాయి. వెనకనుంచి వాహనరూపంలో దూసుకొచ్చిన మృత్యువు నలుగురిని బలితీసుకుంది. జాతీయ రహదారిపై రక్తపు మడుగులో మృతదేహాలు.. ఛిద్రమైన శరీరాలు.. చెల్లాచెదురుగా పడిన మాంసం ముద్దలు.. క్షతగాత్రుల ఆర్తనాదాలు.. చిన్నారుల రోదనలతో ఘటనాస్థలం హృదయ విదారకంగా మారింది.

దేవుడిని ప్రార్థించి.. దేవుడి చెంతకే..
అందరూ క్షేమంగా ఉండాలి.. అంతా మంచి జరగాలని ప్రార్థించి ఇంటికి తిరుగు పయనమైన ఆ ఇరు కుటుంబాల్లో తీరని విషాదం నింపింది. రోడ్డు ప్రమాదం వారిని కానరాని లోకాలకు చేర్చింది. మరికొద్ది నిమిషాల్లో ఇంటికి చేరే క్రమంలో మృత్యువు కబళించింది. గుర్తు తెలియని వాహనం ఢీకొట్టిన ఘటనలో రెండు కుటుంబాల్లో నలుగురు మృతి చెందారు. బాధిత కుటుంబాల రోదనలతో ఆస్పత్రి ప్రాంగణం దద్దరిల్లింది. అనాథలైన చిన్నారుల మౌన రోదన అందరినీ కంటతడి పెట్టించింది. ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండలం మేకలగండి ప్రాంతంలో శనివారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో ఆటోను గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఏముల పొచ్చన్న (58), ఏముల గంగమ్మ(48), శైలజ(28), మడావి సోంబాయి (63) సంఘటనా స్థలంలోనే తుది శ్వాస విడిచారు. మరో ఐదుగురు గాయాల పాలయ్యారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. వీరిలో ఇద్దరు పిల్లల పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. సంఘటన స్థలాన్ని ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి, ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్ సందర్శించారు.

అసలేం జరిగిందంటే..
ఇంద్రవెల్లి మండలం కేస్లాగూడకు చెందిన పొచ్చన్న బతుకుదెరువు నిమిత్తం కొన్నేళ్ల క్రితం ఆదిలాబాద్ పట్టణంలోని రవీంద్రనగర్ వచ్చి ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నాడు. ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈయనకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు. వీరందరికీ పెళ్లిళ్లు అయ్యాయి. వీరి కుటుంబం ప్రతినెలా రెండో శుక్రవారం ఆల్‌నైట్ ప్రేయర్(ప్రార్థన) కోసం ఇచ్చోడలోని హోలీ మౌంటెన్ చర్చికు వెళ్తుంటారు. ఈ క్రమంలోనే పొచ్చన్న తన కుటుంబ సభ్యులతో పాటు ఆదిలాబాద్ పట్టణంలోని బాలాజీ గార్డెన్ సమీపంలో ఉంటున్న మడావి సోంబాయి (సలోమి) కుటుంబ సభ్యులతో కలిసి తన ఆటోలో సాయంత్రం చర్చికి బయల్దేరి వెళ్లారు. పొచ్చన్న, ఆయన భార్య గంగమ్మ, కూతురు శైలజ, ఇద్దరు మనుమరాళ్లు, ఒక మనుమడుతోపాటు సోంబాయి, ఆమె పెద్ద కుమారుడు ప్రేమ్‌సాగర్, మనుమడు దీపక్‌రాజ్‌తో కలిపి తొమ్మిది మంది బయల్దేరి వెళ్లారు. ఇచ్చోడలోని చర్చిలో రాత్రి 9 నుంచి శనివారం తెల్లవారుజామున 3 గంటల వరకు ప్రార్థనలు జరిగాయి. అప్పటివరకు సంతోషంగా గడిపిన ఇరు కుటుంబాలు ఇంటికి తిరుగుపయనం అయ్యారు. పొచ్చన్న స్కూల్ పిల్లలను ప్రతీరోజు ఆటోలో తీసుకెళ్తుంటాడు. తెల్లారితే స్కూల్ ఉంటుందనే ఉద్దేశంతో వేకువజామునే అక్కడినుంచి బయల్దేరారు. గమ్యస్థానం మరో 15కిలోమీటర్ల దూరం ఉండగా మేకలగండి వద్ద రోడ్డు ప్రమాదం చోటు చేసుకొని మరణించారు. వెనక నుంచి ఆటోను గుర్తు తెలియని వాహనం(పోలీసులు లారీగా భావిస్తున్నారు) ఢీకొనడంతో ఆటోలో ప్రయాణిస్తున్న వారంతా ఎగిరిపడ్డారు. వాహనం నుజ్జునుజ్జయింది. ఆ సమయంలో ఆదిలాబాద్ మార్కెట్‌కు కూరగాయలు తీసుకొస్తున్న రైతులు ఈ ఘటనను చూసి పోలీసులకు సమాచారం అందించారు. వారు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రులను రిమ్స్ ఆస్పత్రికి తరలించారు.



గంగమ్మ, శైలజ, సోంబాయి, పొచ్చన్న మృతదేహాలు వరుసగా..



మృత్యువును జయించిన చిన్నారి

మృత్యువును జయించిన చిన్నారులు..
ప్రమాదంలో నలుగురు అక్కడికక్కడే మృతిచెందగా, మిగతా ఐదుగురికి గాయాలయ్యాయి. శైలజ మృతిచెందగా, ఆమెతో ఉన్న ఇద్దరు కూతుళ్లు మాత్రం మృత్యువును జయించారు. మూడేళ్ల ఆరాధ్య, ఎనిమిది నెలల పసిబిడ్డ అర్పిత సురక్షితంగా బయటపడ్డారు. తల్లి మరణంతో ఆ చిన్నారులు అనాథలుగా మిగిలారు. కనీసం ఊహ తెలియని వీరు తల్లి కోసం గుక్కపట్టి ఏడ్చిన తీరు కంటతడి పెట్టించింది.


కేస్లాగూడలో అంత్యక్రియలు
ఇంద్రవెల్లి: మేకలగండి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏముల పొచ్చన్న, భార్య గంగమ్మ, కూతురు శైలజ మృతి చెందడంతో వారి స్వగ్రామం కేస్లాగూడలో విషాదం అలుముకుంది. అంత్యక్రియల నిమిత్తం వారి మృతదేహాలను గ్రామానికి తరలించడంతో గ్రామస్తులు శోకసంద్రంలో మునిగిపోయారు. బంధువులు, కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. అనంతరం ఏమాయికుంట శ్మశాన వాటికకు తరలించి అంత్యక్రియలు నిర్వహించారు.

ఉద్యోగంలో చేరక ముందే..
జన్నారానికి చెందిన దాసరి కిరణ్‌తో శైలజకు కొన్నేళ్ల క్రితం వివాహం జరిగింది. ఈమె రిమ్స్‌లో ఔట్‌సోర్సింగ్ పద్ధతిన స్టాఫ్ నర్స్‌గా పనిచేసింది. కరోనా తర్వాత ఆమెను విధుల నుంచి తొలగించారు. గర్భిణి అయిన ఆమె ప్రసవం కోసం ఇటీవలే ఆదిలాబాద్ పట్టణంలో పుట్టింటికి వచ్చింది. ఎనిమిది నెలల క్రితం ప్రసవం అయింది. ప్రస్తుతం తల్లిగారి ఇంట్లోనే ఇద్దరు కూతుళ్లతో ఉంటుంది. ఇటీవల ఆమెకు ఉట్నూర్ మండలంలోని దండెపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్టాఫ్ నర్సుగా ఉద్యోగం రావడంతో అమ్మ, నాన్న, తన కూతుళ్లతో కలిసి ఇచ్చోడ చర్చికు వెళ్లింది. తిరుగు ప్రయాణంలో తండ్రి పొచ్చన్న, తల్లి గంగమ్మతో మృత్యువు ఒడిలోకి చేరింది. ఇదిలా ఉండగా పొచ్చన్న పెద్ద కుమార్తె విజయ కుమారుడు తేజవర్ధన్ వీరితోపాటే ఉన్నాడు. ఆ బాలుడికి కాలు విరిగింది. ఊపిరితిత్తులు, ఛాతి భాగంలో ఎముకలు విరిగినట్లు వైద్యులు నిర్ధారించారు. కాగా మరో కుటుంబానికి చెందిన సోంబాయి వెంట ఆమె పెద్ద కుమారుడు ప్రేమ్‌సాగర్‌తో పాటు ఆయన కుమారుడు దీపక్‌రాజ్ ఉన్నారు. వీరిద్దరు ఈ ప్రమాదంలో గాయాల పాలయ్యారు. ప్రస్తుతం రిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు.


అతివేగమే ప్రమాదానికి కారణం

• ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

మేకలగండి వద్ద జరిగిన ప్రమాదానికి అతివేగమే కారణమని ఎస్పీ డి.ఉదయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ప్రమాదం తెల్లవారుజామున జరగడంతో, అతివేగంతో ఏ వాహనం ఢీకొట్టిందనే విషయం ఇంకా తెలియలేదన్నారు. అందుకు కారణమైన వాహనాన్ని గుర్తించేందుకు జాతీయ రహదారిపైనున్న సీసీ కెమెరాలు పరిశీలిస్తున్నట్లుగా తెలిపారు. త్వరలోనే ఆ వాహనాన్ని పట్టుకుంటామని వెల్లడించారు. ఘటనా స్థలాన్ని ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్‌తో కలిసి పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీశారు. గుడిహత్నూర్ నుంచి ఆదిలాబాద్ వరకు గల జాతీయ రహదారి ఎన్నో మలుపులతో కూడుకుని ఉందన్నారు. దీంతో ఎగువ నుంచి దిగువ ప్రాంతానికి వచ్చే క్రమంలో భారీ వాహనదారులు ఇంధనం పొదుపు చేయాలనే ఉద్దేశంతో వాహనాలను న్యూట్రల్‌లో ఉంచి నడపడం ప్రమాదాలకు కారణమవుతున్నాయన్నారు. వీటిని అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. ఇందులో భాగంగా పోలీసుశాఖ ఆధ్వర్యంలో సాయంత్రం వేళల్లో డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ప్రదేశాలను గుర్తించి హెచ్చరిక బోర్డులు, రహదారిపై రంబుల్‌స్ట్రిప్స్‌ను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. గత పదేళ్లలో జరిగిన ప్రమాదాలు, ఆయా ప్రదేశాలను గుర్తించి, రోడ్డుపై సాంకేతికంగా ఎలాంటి లోపాలున్నా సరిదిద్దేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలను నియంత్రించవచ్చన్నారు. ఆయన వెంట ఉట్నూర్ సీఐ రామకృష్ణ ఉన్నారు.



రిమ్స్‌లో చికిత్స పొందుతున్న తేజవర్ధన్



రిమ్స్‌లో చికిత్స పొందుతున్న ప్రేమ్‌సాగర్

క్లుప్తంగా

మంత్రి హరీశ్‌రావుకు వినతి



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఉట్నూర్‌రూరల్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న నాల్గో తరగతి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శనివారం హైదరాబాద్‌లో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావును కలిసి వినతిపత్రం అందించినట్లు ఆ సంఘం ఉమ్మడి జిల్లా గౌరవ అధ్యక్షుడు కేబీసీ నారాయణ్ తెలిపారు. ఉమ్మడి జిల్లాలో పనిచేస్తున్న దినసరి, పార్ట్ టైం శానిటేషన్ వర్కర్లను పర్మినెంట్ చేయాలని, రోజువారి వర్కర్లకు నెలసరి వేతనం రూ.30వేలు అందించాలని తదితర సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందించినట్లు తెలిపారు.

వందశాతం బీమా గ్రామంగా ముఖరా(కె)



బీమా పత్రాలతో గ్రామస్తులు

ఇచ్చోడ: ముఖరా(కె) వందశాతం బీమా గ్రామంగా నిలిచిందని సీఎస్సీ జిల్లా మేనేజర్ రాహుల్ అన్నారు. శనివారం ముఖరా (కె) పంచాయతీ కార్యాలయంలో గ్రామస్తులకు బీమా పత్రాలు అందజేసి ఆయన మాట్లాడారు. ముఖరా(కె)లో 220 కుటుంబాల్లో 18 నుంచి 65 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న ప్రతి ఒక్కరికీ బీమా సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. లబ్ధిదారుల ప్రీమియం డబ్బులను సర్పంచ్ మీనాక్షి సొంతంగా అందచేసినట్లు పేర్కొన్నారు. సర్పంచ్ గాడ్గే మీనాక్షి, ఎంపీటీసీ సుభాష్ ఉన్నారు.

తెలంగాణ ఉద్యమకారుల ఆత్మ గౌరవ సదస్సు

నిర్మల్‌చైన్‌గేట్: ఈ నెల 20న హైదరాబాద్‌లోని ఇందిరపార్క్ వద్ద చేపట్టే తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ సదస్సును విజయవంతం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా చైర్మన్ కొట్టే శేఖర్ నిర్మల్ జిల్లా చైర్మన్ ముస్కమ్ రామకృష్ణగౌడ్ తెలిపారు. తెలంగాణ ఉద్యమకారులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు, ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులకు జీవనభృతి, బస్సుల్లో రాయితీ కల్పించడం అనే డిమాండ్‌లతో సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమానికి ఉద్యమకారులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. నేడు పోస్టర్లు ఆవిష్కరించనున్నట్లు తెలిపారు.

రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి

ఎదులాపురం: అంగన్‌వాడీ టీచర్ల సమస్యలను పరిష్కరించాలని కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఈ నెల 22, 23వ తేదీల్లో నిర్వహించనున్న అంగన్‌వాడీ టీచర్స్, మినీ టీచర్స్, హెల్పర్స్ అసోసియేషన్ (ఏఐటీయూసీ అనుబంధం) రాష్ట్ర మూడవ మహాసభలను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్, అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రకళ పిలుపు నిచ్చారు. జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అసోసియేషన్ జిల్లా సమావేశంలో వారు మాట్లాడారు. అంగన్‌వాడీలు కనీస వేతన సమస్యలను ఎదుర్కొంటున్నారని, ప్రస్తుతం రూ.13,600 మాత్రమే ఇస్తున్నారని, కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పీఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్ సౌకర్యాలను సైతం కల్పించాలన్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న మహాసభలను జయప్రదం చే యాలని పిలుపు నిచ్చారు. ఏఐటీయూసీ జి ల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్ ఉన్నారు.

సండే స్పెషల్

ఆయుష్షు ప్రదాతలు..!

- అవయవాల దానంతో కొందరికి పునర్జన్మ
- ముందుకొస్తున్న కుటుంబ సభ్యులు
- నేత్ర, శరీర దానానికి అంగీకారపత్రాలు

సాక్షి, మంచిర్యాల డెస్క్: మనిషి మరణించినా ఈ లోకాన్ని చూడాలంటే నేత్రదానం వల్ల సాధ్యమవుతుంది. ఒక్కరు అవయవదాతగా మారడం వల్ల తొమ్మిది మందికి జీవితాన్ని ప్రసాదించే అవకాశం ఉంది. అవయవ దానంపై ప్రజల్లో అవగాహన పెరగడం వల్ల దాతల సంఖ్య పెరుగుతూ వస్తోంది. వైద్యులు ఒక వ్యక్తిని బ్రెయిన్‌డెడ్‌గా ప్రకటించిన తర్వాత కుటుంబ సభ్యులు దుఃఖాన్ని దిగమింగి అవయవదానం చేస్తూ మరికొందరి కుటుంబాల్లో వెలుగును ప్రసాదిస్తున్నారు.



మరణానంతరం శరీరదానానికి అంగీకార పత్రాలతో కార్మెల్ హైస్కూల్ సిస్టర్స్ (ఫైల్)

ఇదీ వెబ్‌సైట్
www.jeevandan.gov.in
సదాశయ ఫౌండేషన్‌ను సంప్రదించాల్సిన నంబర్లు
టి.శ్రవణ్‌కుమార్, వ్యవస్థాపక అధ్యక్షుడు : **99486 09591**
సీహెచ్.లింగమూర్తి, ప్రధాన కార్యదర్శి **94927 81306**

నలుగురిలో ఒకరికే చూపు..!



చూపును ప్రసాదించాలంటే దేశంలో ప్రతీ సంవత్సరం రెండు లక్షల కార్నియాలు అవసరమని, కానీ 50వేలు మాత్రమే దాతల నుంచి సేకరిస్తున్నారని అంచనా. దాతలు ముందుకు రాకపోవడం వల్ల ప్రతీ నలుగురిలో ముగ్గురు ఎదురుచూడాల్సి వస్తోంది. నేత్రదానానికి ముందుకొస్తున్నా ఇంకా ఆ సంఖ్య పెరగాల్సి ఉంది. గుండె, లివర్, కళ్లు, ఊపిరితిత్తులు, కిడ్నీలు, పాంక్రియాస్ దానం చేయవచ్చు. వీటిని రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జీవన్‌దాన్ ద్వారా అవసరమైన బాధితులకు అమర్చే వీలుంది. ఈ ఏడాది ఇప్పటివరకు తెలుగు రాష్ట్రాల్లోని 381మందికి కిడ్నీలు, లివర్, గుండె, కార్నియాలు, ఊపిరితిత్తులు అమర్చారు.

దాతలుగా మారాలంటే..

ఎవరైనా అవయవదాతలుగా మారవచ్చు. జీవన్‌దాన్ వెబ్‌సైట్ ద్వారా, సదాశయ ఫౌండేషన్‌ను సంప్రదించి వివరాలను నమోదు చేసుకోవచ్చు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేత్ర, అవయవదానంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దాతలుగా ముందుకొచ్చిన వారి నుంచి అంగీకార పత్రాలు స్వీకరిస్తున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అవయవ, శరీర, నేత్ర దానంపై 900కు పైగా అవగాహన సదస్సులు నిర్వహించారు. తమ తదనంతరం నేత్ర, అవయవ, శరీరదానాలకు ముందుకొచ్చి అంగీకారపత్రాలు అందజేసిన వారు 50 వేల మందికి పైగా ఉన్నారు. ఇప్పటివరకు 650 మంది నేత్రదానం, అవయవదానం చేసిన వారు 80 మంది, శరీరదానం చేసిన వారు 90 మంది వరకు ఉన్నారు.

అంగీకారం..

- మంచిర్యాలలోని కార్మెల్ హైస్కూల్ సిస్టర్లు మరణానంతరం శరీర దానానికి ముందుకొచ్చి అంగీకార పత్రాలు అందజేశారు.
- మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో జనహిత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో 2018లో నేత్ర, అవయవదాన అవగాహన సదస్సు నిర్వహించారు. 300 మంది నుంచి నేత్ర, అవయవ దానానికి అంగీకార పత్రాలు స్వీకరించారు.
- ఈ నెల 3న శ్రీరాంపూర్ గనిలో మెకానికల్ ఫోర్‌మెన్ కే.వెంకటేశం, ఎస్‌డీఎల్ ఆపరేటర్ బుద్ధి ప్రసాద్ అవయవ దానం చేయడానికి అంగీకారపత్రాలు అందజేశారు. వారిని గని మేనేజర్ ఫౌండేషన్ సభ్యులు ఘనంగా సన్మానించి ప్రశంసాపత్రం అందజేశారు.



పార్థివదేహాన్ని వరంగల్ కాకతీయ మెడికల్ కాలేజీకి అప్పగిస్తున్న సదాశయ ఫౌండేషన్ సభ్యులు (ఫైల్)

నలుగురికి పునర్జన్మనిచ్చిన ఆర్‌ఎంపీ



రమేష్(ఫైల్)

నిర్మల్ జిల్లా కుంటాల మండల కేంద్రానికి చెందిన మైస రమేష్(41) వృత్తిరీత్యా ఆర్‌ఎంపీ. హఠాత్తుగా బీపీ పడిపోవడంతో ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని కార్పొరేట్ ఆస్పత్రికి తరలించగా మూడు రోజుల చికిత్స తర్వాత వైద్యులు బ్రెయిన్‌డెడ్‌గా ప్రకటించారు. రమేష్ భార్య రేఖ అతడి అవయవదానానికి ముందుకొచ్చింది. దీంతో ఈ ఏడాది జూన్ 21న గుండె, కిడ్నీలు, లివర్‌ను నలుగురికి అమర్చడం ద్వారా రమేష్ వైద్యుడిగానే కాకుండా మరణిస్తూ పునర్జన్మ ప్రసాదించాడు.

- మంచిర్యాల జిల్లా చెన్నూర్‌కు చెందిన జన్నం కళావతి అనారోగ్యంతో ఈ ఏడాది జనవరి 22న మృతిచెందగా సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కుటుంబ సభ్యులు రామగుండం మెడికల్ కళాశాలకు పార్థివదేహాన్ని అప్పగించారు.
- మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఏరియా సింగరేణి ఉద్యోగి కామెర శంకర్ 2018లో మృతిచెందగా.. కుటుంబ సభ్యులు ఆయన కిడ్నీలు, లివర్, గుండె దానం చేశారు.
- మంచిర్యాల జిల్లా చెన్నూర్ మండలం సోమన్‌పల్లి గ్రామానికి చెందిన తుమ్మల ప్రశాంత్‌రెడ్డి, కోటపల్లి మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన చల్లా తిరుపతిరెడ్డి మరణానంతరం అవయవాలు దానం చేశారు.
- మంచిర్యాల జిల్లా రామకృష్ణాపూర్‌కు చెందిన ఇంజినీరింగ్ విద్యార్థి సృజన్‌సింహా రైలు ప్రమాదంలో గాయపడి మృతి చెందాడు. గుండె, కళ్లు, ఊపిరితిత్తులు, మూత్రపిండాలు, కాలేయం కుటుంబ సభ్యులు దానం చేయగా.. ఇతరులకు అమర్చారు.

చట్టం చేయాలి..



ప్రతి ఒక్కరూ అవయవ దానానికి ముందుకు రావాలి. మనకు ఎందుకూ పనికిరానివి.. సమాజానికి పనికొచ్చేవి.. రూ.కోట్లు వెచ్చించినా దొరకని నేత్ర, అవయవాలను మనం వృథా చేయకూడదు. దీనిపై ప్రతి ఒక్కరూ అవయవదానం చేసేలా.. రాష్ట్రపతి నుంచి సామాన్యుడి వరకు నేత్ర, అవయవదానం ఏది వీలైతే అది చేసేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చట్టం చేయాలి. మా తమ్ముడు టి.అశోక్‌కుమార్ కాళోజీ నారాయణరావును స్ఫూర్తిగా తీసుకుని శరీర దానానికి అంగీకరించాడు. 2006లో మరణించగా అతడి కోరిక మేరకు కాకతీయ మెడికల్ కాలేజీకి మృతదేహాన్ని అప్పగించాం. ఆయన స్ఫూర్తితోనే 2008లో గోదావరిఖనిలో సదాశయ ఫౌండేషన్ ప్రారంభించాం. రాష్ట్ర వ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. – శ్రవణ్‌కుమార్, సదాశయ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు

వైద్య పరిశోధనకు ఉపయోగ పడాలని..



రవి కుటుంబం

మరణానంతరం వైద్య పరిశోధనలకు శరీరం ఉపయోగపడాలనే ఉద్దేశంతో అవయవాలు, శరీర దానానికి కుటుంబమంతా అంగీకరించారు. మంచిర్యాల జిల్లా కాసిపేట మండలం ట్యాంక్‌బస్తీకి చెందిన సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి, తన భార్య రాజకుమారి, కుమారుడు ప్రణయ్, కూతురు శ్రీనిత అవయవదాన అంగీకార పత్రాలు అందజేశారు. వీరితోపాటు అతని సోదరుడి కుటుంబం సంకె శ్రావణిదేవి, లక్ష్మి, సుశాంతిలూ ముందుకొచ్చారు.

జల్సాల కోసం కలప దొంగతనం

- ముగ్గురు నిందితులకు రిమాండ్
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ జీవన్‌రెడ్డి

మామడ: జల్సాల కోసం సులభంగా డబ్బులు సంపాదించాలనే ఆలోచనతో కలప దొంగతనానికి పాల్పడి పోలీసులకు పట్టుబడి జైలుపాలయ్యారు ముగ్గురు ప్రబుద్ధులు. డీఎస్పీ జీవన్‌రెడ్డి వివరాల ప్రకారం... మామడ పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన సమావేశంలో వెల్లడించారు. మండలంలోని కమల్‌కోట్ గ్రామం శివారులో సత్యం కలప సామిల్ నిర్వహిస్తున్నాడు. ఈ సామిల్‌ను 2019లో మూడు గదుల్లో కలపను ఉంచి అధికారులు సీజ్ చేశారు. జల్సాలకు అలవాటు పడిన కలకుంట్ల గంగారాం సామిల్‌లో కలప ఉందనే విషయం తెలుసుకున్నాడు. ఎలాగైన కలపను చోరీ చేయాలనే ఆలోచనతో మెట్‌పల్లికి చెందిన ఓ వ్యక్తి నుంచి కారును పెళ్లి ఉందని చెప్పి రెండు నెలలకు అద్దెకు తీసుకున్నాడు. పల్లెపు రాజేందర్, బోదాసు రాములకు వివరాలు అందించి కలపను చోరీ చేస్తే సులభంగా డబ్బులు సంపాదించవచ్చని చెప్పాడు. ఈ ముగ్గురు కలిసి కారులో సామిల్‌కు వెళ్లి రెక్కి నిర్వహించారు. సామిల్‌ను సీజ్ చేసిన తాళాలు తొలగించి వారం రోజులకు ఒకసారి కలపను తీసుకువెళ్లి అంబర్‌పేట్‌లో గంగారం ఇంట్లో నిల్వ ఉంచారు. శనివారం చోరీ చేసి కలపను కారులో నిల్వ చేసి విక్రయించేందుకు నిర్మల్ వైపు వెళ్తుండగా న్యూసాంగ్వి క్రాస్ రోడ్డు వద్ద పోలీసులు పట్టుకుని విచారించగా అసలు విషయం వెల్లడించారు. చోరీకి వినియోగించిన కారు, 2లక్షలు విలువ చేసే కలప, మొబైల్ ఫోన్‌లు, ఇనుపరాడ్ పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. కలప చోరీ కేసును చాకచక్యంగా ఛేదించిన ఆర్‌ఎస్‌ఐ రవినాయుడు, సీఐ నవీన్‌కుమార్, మామడ, సోన్, లక్ష్మణచాంద ఎస్సైలు అశోక్, రవీందర్, రాహుల్‌ను డీఎస్పీ అభినందించారు.



మామడలో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ

సరిహద్దులో ఎక్సైజ్ శాఖ అధికారుల తనిఖీలు

తానూరు: మహారాష్ట్ర సరిహద్దులోని తానూరు, ముథోల్, కుభీర్ మండలాల సరిహద్దు గ్రామాల రహదారులపై శనివారం భైంసా ఎక్సైజ్ శాఖ అధికారులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. గతంలో నిర్మల్ జిల్లా కలెక్టర్‌గా విధులు నిర్వహించిన ముషరఫ్ అలీఫారూఖీ ఇటీవల ఎక్సైజ్ శాఖ డైరక్టర్‌గా నియమితులైన విషయం తెలిసిందే. మహారాష్ట్ర నుంచి మద్యం రాక అరికట్టేందుకు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. తనిఖీల్లో భైంసా ఎక్సైజ్ ఎస్సైలు రమేశ్, ప్రణీత్‌గౌడ్, హెడ్ కానిస్టేబుల్ అశోక్ ఉన్నారు.

గడ్డెన్నవాగు ప్రాజెక్ట్‌లో వేర్వేరుగా ఇద్దరి ఆత్మహత్య

- మద్యానికి బానిసై ఒకరు.. మనస్తాపంతో మరొకరు..

భైంసాటౌన్: భైంసాలోని గడ్డెన్నవాగు ప్రాజెక్టులో ఇద్దరు వ్యక్తులు వేర్వేరుగా ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఎస్సైలు ఎండీ గౌసుద్దీన్, షాదీక్ హుస్సేన్ వివరాల ప్రకారం.. గుండెగాం గ్రామానికి చెందిన బాలాజీ (28) భైంసాలోని ఓ అద్దె ఇంట్లో నివాసముంటూ స్థానికంగా కూరగాయలు విక్రయిస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసయ్యాడు. ఈ నెల 6న మద్యం తాగి ఇంటికి వచ్చి భార్య, తల్లితో గొడవపడి రాత్రి 10 గంటల ప్రాంతంలో ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. శనివారం గడ్డెన్నవాగు ప్రాజెక్టు నీటిలో మృతదేహం కనిపించడంతో గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారమివ్వగా వారు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడికి భార్య శృతి, కొడుకు, కూతురు ఉన్నారు. కేసు దర్యాప్తు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

మనస్తాపంతో మరొకరు...

పట్టణంలోని కుంట ప్రాంతానికి చెందిన షేక్ జాబీర్(25) మేస్త్రి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. నాలుగేళ్ల క్రితం వివాహం కాగా ఇటీవల భార్యతో విడాకులు కావడంతో మనస్తాపానికి గురయ్యాడు. ఈనెల 6న ఇంటి నుంచి బయటికి వెళ్లి శనివారం గడ్డెన్నవాగు ప్రాజెక్టులో మృతిచెంది కనిపించాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై షాదీక్ హుస్సేన్ తెలిపారు.

రెండు ద్విచక్ర వాహనాలు దహనం

ఖానాపూర్: పట్టణంలోని విద్యానగర్ కాలనీకి చెందిన పంచాల శంకర్ ఇంటి ముందు ఉన్న రెండు ద్విచక్ర వాహనాలను గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం రాత్రి దగ్ధం చేశారని ఎస్సై ఆర్. శంకర్ తెలిపారు. ఇంటి పక్కనే ఉన్న స్థలంలో పార్కింగ్ చేసిన వాహనాలను దగ్ధం చేసిన అనుమానితులపై ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ప్రశాంతంగా ట్రిపుల్‌ఐటీ కౌన్సెలింగ్

భైంసా: బాసర ట్రిపుల్ ఐటీ కౌన్సెలింగ్ రెండోరోజు శనివారం ప్రశాంతంగా కొనసాగింది. క్యాంపస్‌లోని అకడమిక్ బ్లాక్‌లో విద్యార్థుల సర్టిఫికెట్లు పరిశీలించారు. 451 విద్యార్థులు హాజరు కాగా 49 మంది గైర్హాజరయ్యారు. ఉదయం 9 గంటల నుంచి ధ్రువపత్రాల పరిశీలన ప్రారంభం కాగా, రెండవ రోజు 501 నుంచి 1000 వరకూ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆదివారం 1001 నుంచి 1404 వరకు సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందని తెలిపారు. కౌన్సెలింగ్ ప్రక్రియను డైరెక్టర్ ప్రొఫెసర్ సతీశ్‌కుమార్ పర్యవేక్షించారు. రెండో రోజు కౌన్సెలింగ్ ప్రారంభం కాగానే మెదక్ జిల్లా అక్కన్నపేటకు చెందిన బోయిని వందనకు ధ్రువపత్రం అందించారు. స్పెషల్ క్యాటగిరీలకు చెందిన పీహెచ్, స్పోర్ట్స్ విద్యార్థులకు ధ్రువపత్రాల పరిశీలన ఈనెల 14న ఎన్‌సీసీ, సీఏపీ విద్యార్థుల ధ్రువపత్రాల పరిశీలన 15వ తేదీన ఉంటుందని తెలిపారు. ఈ కౌన్సెలింగ్ ప్రక్రియలో కోఆర్డినేటర్ డాక్టర్ చంద్రశేఖర్, కో కోఆర్డినేటర్లు డాక్టర్ పావని, డాక్టర్ దత్తు, సభ్యులు చరణ్‌రెడ్డి, అప్పింగర్ విజయ్‌కుమార్, అడ్మిషన్స్ కమిటీ సభ్యులు హరికృష్ణ, సునీత, కృష్ణ, సంతోష్‌రెడ్డి, అధ్యాపకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఏజెన్సీ గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలి

ఉట్నూర్‌రూరల్: వర్షాకాలంలో ఆదివాసీ గిరిజనులు అనారోగ్యాల బారిన పడే ప్రమాదం ఉందని, ఏజెన్సీ గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించేలా చొరవ తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు సెడ్మకి ఆనంద్‌రావ్ ఐటీడీఏ పీవోను కోరారు. ఇటీవల ఆమె ఐటీడీఏ పీవోగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఆయన శనివారం ఆమెను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువతో సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ గ్రామాల్లో విద్యా వ్యవస్థ మెరుగుపడేలా చూడాలని కోరారు. ఉపాధ్యాయుల కొరత ఉన్న చోట అర్హత గల గిరిజన అభ్యర్థులతో సీఆర్టీలను నియమించాలన్నారు. వారం కిందట సీఆర్టీల నియమాకం కోసం నిర్వహించిన సీఆర్టీలలో తొమ్మిది తెగల ఆదివాసీ అభ్యర్థులనే నియమించాలని కోరారు. అటవీ పోడు భూముల విషయంలో కొంత మందికి మాత్రమే అటవీ హక్కు పత్రాలు రావడం జరిగిందని, అర్హులైన వారందరికీ అందేలా చూడాలని కోరారు. ఆయన వెంట ఆదివాసీ నేతలు కనక తులసీరాం, నాగోరావ్, బానోత్ జైవంత్ రావ్ ఉన్నారు.

కడెం ప్రాజెక్ట్‌కు స్వల్పంగా ఇన్‌ఫ్లో

కడెం: కడెం ప్రాజెక్ట్‌లోకి శనివారం స్వల్పంగా ఇన్‌ఫ్లో మొదలైందని అధికారులు తెలిపారు. ఉదయం 2,737 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చినట్లు వెల్లడించారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి మట్టం 700(7.603టీఎంసీ) అడుగులు కాగా, ప్రస్తుతం 678.800(2.06టీఎంసీ) అడుగుల నీటిమట్టం ఉంది. గతేడాది జూలై 8 తేదీన 693.775 అడుగుల నీటిమట్టం ఉంది. జూలై 9న కాలువల ద్వారా ఆయకట్టుకు నీటిని విడుదల చేశారు.



కడెం ప్రాజెక్ట్

బోటింగ్ ప్రారంభం

కడెం ప్రాజెక్ట్‌లో బోటింగ్‌ను శనివారం పునఃప్రారంభించినట్లు ఇన్‌చార్జి మేనేజర్ సునావత్ తిరుపతి తెలిపారు. ప్రాజెక్ట్‌లో నీటి నిల్వ తగ్గిపోవడంతో కొద్ది రోజులుగా బోట్ రైడ్‌కు బ్రేక్ పడింది. ప్రస్తుతం కొంతమేర నీళ్లు రావడంతో తిరిగి బోటింగ్ ప్రారంభించారు.

ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణంపై రైతుల నిరసన

దిలావర్‌పూర్: నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్–గుండంపల్లి గ్రామాల నడుమ గోదావరి తీరంలో నిర్మించతలపెట్టిన ఇథనాల్ కర్మాగారాన్ని వ్యతిరేకిస్తూ రైతులు శనివారం ఆందోళన చేశారు. నిర్మల్–భైంసా రహదారిపై గుండంపల్లి గ్రామానికి చెందిన రైతులు రాస్తారోకో చేశారు. ఆయా పార్టీ నేతలు వారికి మద్దతు తెలిపారు. ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మిస్తే తమ పంటలు దెబ్బతింటాయని, ఫ్యాక్టరీ నిర్మాణం ఆలోచన విరమించుకోవాలని కోరారు. రైతులకు, ప్రజలకు ఇబ్బంది కలిగించే ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణం వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు అక్కడకు చేరుకుని రైతులతో మాట్లాడారు. ఆందోళన విరమింపజేశారు. నిరసనలో జెడ్పీటీసీ తక్కల రమణారెడ్డి, టీఆర్‌ఎస్ మండల కన్వీనర్ దేవేందర్‌రెడ్డి, రైతుబంధు సమితి జిల్లా నేత చిన్నారెడ్డి, నాయకులు విద్యాసాగర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.



గుండంపల్లి గ్రామంలో నినాదాలు చేస్తున్న రైతులు, నాయకులు

పశువైద్య సిబ్బంది నిర్బంధం

- టీకాలు లేవని చెప్పడంతో ఆగ్రహించిన పెంబి రైతులు
- ఆస్పత్రిలోనే ఉంచి తాళం వేసిన వైనం

పెంబి: పశువులకు టీకాలు లేవని చెప్పడంతో ఆగ్రహించిన రైతులు వైద్య సిబ్బందిని ఆసుపత్రిలో నిర్బంధించి తాళం వేశారు. ఈ ఘటన నిర్మల్ జిల్లా పెంబి మండల కేంద్రంలో శనివారం జరిగింది. కొన్ని రోజులుగా మూడు కుక్కలు గ్రామంలో పశువులను కరుస్తున్నాయి. దీంతో శనివారం ఆస్పత్రికి వెళ్లిన రైతులు పశువులకు టీకాలు వేయాలని కోరారు. టీకాలు 30 పశువులకు సరిపోయే టీకాలు మాత్రమే ఉన్నాయని సిబ్బంది తెలుపడంతో ఆగ్రహించిన రైతులు సిబ్బందిని ఆస్పత్రిలోనే ఉంచి తాలం వేశారు. కాంపౌండర్ అర్షత్, గోపాలమిత్ర సిబ్బంది సుభాష్, లింగాగౌడ్ ఆస్పత్రిలోనే ఉండిపోయారు.. ఈ సందర్భంగా గ్రామ రైతులు మాట్లాడుతూ.. పశువైద్య శాలలో మందులు ఉండడం లేదని, వైద్యులు సకాలంలో విధులకు రావడం లేదని తెలిపారు. పశువైద్యాధికారి విజయ్ జాదవ్‌ను ఫోన్‌లో సంప్రదించగా, టీకాలు పైనుంచే రావడం లేదని తెలిపారు. ఏడీ, ఈడీని ఫోన్‌లో సంప్రదించగా పొంతనలేని సమాధానం ఇచ్చారన్నారు. కాసేపటి తర్వాత సిబ్బందిని వదిలిపెట్టారు.



పశువైద్య సిబ్బందిని గదిలో నిర్బంధించి నిరసన తెలుపుతున్న పెంబి గ్రామ రైతులు

ఉచిత శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి

ఉట్నూర్‌రూరల్: జిల్లా వయోజన విద్యాశాఖ, పీపుల్స్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కుట్టుమిషన్ శిక్షణ, అక్షరాభ్యాసం కార్యక్రమాల్లో శిక్షణ తీసుకున్న అభ్యాసకులకు 30మంది (వయోజనులకు) పరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. మండలంలోని బీర్సాయిపేటలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వయోజన విద్యా జిల్లా ఉపసంచాలకులు శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. మంచిర్యాల జిల్లా అధికారి అజ్మీర పురుషోత్తం, పీపుల్స్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఉమ్మడి జిల్లా కన్వీనర్ రెడ్డిమల్ల ప్రకాశం, మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు అశోక్ ఉన్నారు.